సాక్షి
వనపర్తి
సోమవారం ၊ 22 ၊ సెప్టెంబర్ ၊ 2025



కురుమూర్తికి పోటెత్తిన భక్తులు

ఆదివారం అమావాస్య సందర్భంగా అమ్మాపురం కురుమూర్తిస్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

-10లో ▸



జూరాలకు భారీగా వరద

జూరాల జలాశయానికి ఆదివారం ఎగువ నుంచి భారీగా వరద రావడంతో 29 గేట్లు పైకెత్తి దిగువకు నీటిని వదిలారు.

-10లో ▸

గరిష్టం/కనిష్టం
33.6/22.3

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

పత్తి రైతు చిత్తు..!

అధిక వర్షాలతో దెబ్బతిన్న పంట



అమరచింత మండలం కొంకన్వానిపల్లి శివారులో వాడుముఖం పట్టిన పత్తి పంట

- ఎండు, ఆకుమచ్చ తెగులుతో తగ్గిన దిగుబడి
- జిల్లాలో 15,831 ఎకరాల సాగు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు

అమరచింత: అధిక వర్షాలు, తెగుళ్లతో పత్తి పంట దెబ్బతిని ఆశించిన దిగుబడి రాక సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ఆశించిన దిగుబడి వస్తుందని ఆశించిన రైతన్నకు అప్పులు, కన్నీరే మిగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. పూత, పిందెతో పాటు గూడ, కాయలు రాలుతోందని.. వ్యవసాయ అధికారులు సూచించిన మందులు పిచికారీ చేసినా ఏకదాటిగా కురిసిన వర్షాలకు పంటలు పూర్తిగా ఆగమయ్యాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి వర్షాకాలంలో జిల్లావ్యాప్తంగా 15,831 ఎకరాల్లో పత్తి సాగైనట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఎకరాకు సుమారు రూ.35 వేల వరకు పెట్టుబడి అయిందని.. పంట ఎండుముఖం పట్టి ఉన్న కొద్దిపాటి పత్తినైనా సకాలంలో అందుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. వ్యవసాయ కూలీలను ఇతర ప్రాంతాల నుండి రోజుకు రూ.450 కూలి ఇచ్చి కాసిన పత్తిని ఏరి ఇళ్లకు తరలించుకుంటున్నారు.

పెట్టుబడి ఇలా...

పత్తి సాగుకు ఎకరాకు రూ.35 వేలు.. కౌలు రైతులకైతే రూ.45 వేల వరకు పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. పొలం దున్నడానికి రూ.2 వేలు, సాలు కొట్టడానికి రూ.2,500, విత్తనానికి రూ.3 వేలు ఖర్చు అవుతుండగా.. కూలీలకు రెండు పర్యాయాలకు రూ.8 వేలు, ఎరువులకు రూ.12 వేలు, మందుల పిచికారీ మూడు పర్యాయాలకు రూ.9 వేల వరకు అవుతుందని వివరించారు. వీటితో పాటు పత్తి ఏరేందుకు అయ్యే ఖర్చు వీటికి రెట్టింపు అవుతుందంటున్నారు.



పామిరెడ్డిపల్లి శివారులో పత్తి ఏరుతున్న కూలీలు

మండలాల వారీగా పత్తి సాగు ఇలా..

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో..)
అమరచింత	4,857
ఆత్మకూర్	4,270
మదనాపురం	2,445
పెద్దమందడి	1,570
ఖిల్లాఘనపురం	1,483
కొత్తకోట	535
రేవల్లి	311
గోపాల్‌పేట	145
వనపర్తి	120
పెబ్బేరు	35
ఏదుట్ల	30
చిన్నంబావి	23
పాన్‌గల్	4
శ్రీరంగాపురం	3

తగ్గిన దిగుబడి..

ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్న అంచనాలతో రైతులు పత్తి సాగు చేశారు. కాసిన పత్తి కాయలు అధిక వర్షాలకు రాలిపోవడం, మిగిలిన కాయల నుంచి వచ్చే పత్తి కేవలం ఎకరాకు 2 క్వింటాళ్ల వరకు మాత్రమే చేతికందే పరిస్థితి నెలకొంది. ఈసారి మార్కెట్‌లో పత్తికి ఆశించిన ధర లేకపోవడంతో వచ్చిన పత్తిని ఇంటికి తరలించి భద్రపర్చుకుంటున్నారు. మార్కెట్‌లో క్వింటాకు రూ.7 వేల వరకు ఉండగా దళారులు కేవలం రూ.5,500 మాత్రమే చెల్లిస్తుండటంతో రైతన్నలు భారీగా నష్టపోతున్నారు. ఎకరాకు రూ.15 నుంచి రూ.20 వేల వరకు నష్టం వాటిల్లుతుందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొదటిసారికే పరిమితం..

వాతావరణం అనుకూలిస్తే రెండు, మూడు పర్యాయాలు పత్తి ఏరుకునే అవకాశం ఉండేది. కాని ఈసారి పూర్తిగా దెబ్బతినడంతో ఒకసారి మాత్రమే పత్తి ఏరుకునే వీలుందని రైతులు చెబుతున్నారు.

పూత రాలింది..



ఈసారి ఐదు ఎకరాల్లో పత్తి సాగుచేశా. ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడి అయింది. గత నెల విరివిగా కురిసిన వర్షాలకు పత్తి మొక్కలు మెత్తగా మారి ఆకులు రంగులు మారడంతో పాటు పూత రాలిపోయింది. కాయలు సైతం తెగుళ్ల బారిన పడటంతో పత్తి బయటపడటం లేదు. ఈసారి ఎకరాకు కేవలం 2 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చే అవకాశం ఉంది.

– లక్ష్మన్న, రైతు, మదిగట్ల (పెద్దమందడి)

అధిక వర్షాలతో..



5 ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. అధిక వర్షాలు, తెగుళ్లతో ప్రస్తుతం రెండు ఎకరాల్లో మాత్రమే కాయల ద్వారా పత్తి బయటపడింది. ఇది కూడా ఎకరాకు 2 క్వింటాళ్ల వరకు మాత్రమే చేతికందే పరిస్థితి ఉంది. రూ.500 కూలి చెల్లిస్తూ ఇతర ప్రాంతాల నుంచి కూలీలను రప్పించి పత్తి ఏరుతున్నాం.

– అమడబాకుల సుజాత, కొంకన్వానిపల్లి

నష్టాలు తప్పడం లేదు..



ఈసారి మూడు ఎకరాల్లో పత్తి సాగుచేశా. తెగుళ్లు సోకి పత్తి కాయలు రాలిపోయాయి. కేవలం 1.50 ఎకరాల పంట మాత్రమే చేతికందే అవకాశం ఉంది. నష్టాలు తప్పడం లేదు.

– లక్ష్మి, రైతు, కొంకన్వానిపల్లి

ప్రభుత్వ ఆదేశాల మేరకే..



ఈసారి అధిక వర్షాలతో పత్తి దిగుబడి పూర్తిగా తగ్గుతోంది. తెగుళ్ల నుంచి పంటను కాపాడేందుకు రైతులకు సూచనలు, సలహాలిచ్చినా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పంటలు ఎర్రబడ్డాయి. రైతులు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పంట నష్టపోయిన రైతుల నివేదిక సిద్ధం చేసి పంపిస్తాం.

– దామోదర్, ఏడీఏ, కొత్తకోట

త్వరలో డీసీసీ సారథుల నియామకం?

వనపర్తి రేసులో ఇరుపక్షాల నేతలు

- టీపీసీసీ, ఏఐసీసీ స్థాయిలో ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడి ప్రయత్నాలు
- స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ప్రకటించే అవకాశం
- ఇటీవల స్థానిక నేతలతో ముఖ్యమంత్రి చర్చించినట్లు ప్రచారం

వనపర్తి: కొంతకాలంగా అధికార కాంగ్రెస్‌పార్టీలో చర్చనీయాంశంగా మారిన డీసీసీ అధ్యక్షుల నియామకంపై దసరాలోగా క్లారిటీ వచ్చే అవకాశాలు ఉన్నట్లు క్యాడర్ చర్చ జరుగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా పార్టీ జిల్లా సారథులను నియమించి వారి సేవలను పార్టీ అభ్యర్థుల గెలుపునకు వినియోగించుకోవాలని వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. మిగతా జిల్లాల పరిస్థితి ఎలా ఉన్నా.. జిల్లా విషయానికొస్తే అధ్యక్ష పదవిలో రేసులో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి వర్గీయులు కాస్త గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌ని మరోమారు కొనసాగించాలనే ప్రతిపాదన చిన్నారెడ్డి రాష్ట్ర, కేంద్ర కమిటీల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. కాదంటే.. ఓ న్యాయవాది, మరో రిటైర్డ్ ఉద్యోగి, సీనియర్ నాయకుడి పేర్లు సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇనాళ్లు ఓ లెక్క... నేను పార్టీలో చేరాక మరోలెక్క అన్నట్లు ఎమ్మెల్యే మేఘారెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ పెద్దలను ఒప్పించి టిక్కెట్ తెచ్చుకొని అన్యూహ్యంగా ఇచ్చిన మాట ప్రకారం బలమైన నాయకుడిపై భారీ మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే. ఈయనతోపాటు పార్టీలో చేరి తన గెలుపునకు కీలకపాత్ర పోషించిన సన్నిహిత మిత్రుడు, మాజీ కౌన్సిలర్, మాజీ ఎంపీపీ ముగ్గురి పేర్లను ప్రతిపాదించినట్లు సమాచారం. వీరిలో ఎవరు డీసీసీ పీఠం దక్కించుకుంటారో తెలుసుకోవాలంటే మరింత సమయం వేచి చూడాల్సిందే.



పట్టం కట్టేదెవరికో..?

గెలుపు గుర్రాలకే టికెట్లు అన్న విధానాన్ని అసెంబ్లీ ఎన్నికల్లో పాటించగా.. అదే విధానాన్ని డీసీసీ అధ్యక్షుల నియామకంలోనూ కేంద్ర, రాష్ట్ర పెద్దలు కొనసాగిస్తున్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇదే కొనసాగితే డీసీసీ పీఠం ఎమ్మెల్యే వర్గీయులకే దక్కడం ఖాయమని చెప్పవచ్చు. ఈ విషయంలో జిల్లాలో భాగస్వాములైన కొల్లాపూర్, దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు సైతం ఎమ్మెల్యే ప్రతిపాదననే బలపర్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. దీంతో డీసీసీ పీఠం ఎమ్మెల్యే వర్గీయులకు దక్కడం లాంచనప్రాయమేనని పార్టీ శ్రేణుల్లో చర్చ వినిపిస్తోంది.

సీఎం క్లారిటీ ఇచ్చారా..?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డీసీసీ అధ్యక్షుల నియామకంపై ఇటీవల పీసీసీ అధ్యక్షుడితో పాటు ముఖ్యనేతలతో భేటీ అయిన విషయం విధితమే. వనపర్తి డీసీసీ అధ్యక్షుడి విషయమై స్థానిక నేతలతో చర్చించి ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడికే ఖాయం చేద్దామనే క్లారిటీ ఇచ్చారనే ప్రచారం స్థానికంగా వినిపిస్తోంది. చిన్నారెడ్డి వర్గీయుల్లో ఒకరికి ఇటీవల పీసీసీ కార్యవర్గంలో స్థానం కల్పించినందుకుగాను డీసీసీ పదవిని ఎమ్మెల్యే వర్గీయులకు ఇస్తారా అనే కోణంలో క్యాడర్ చర్చించుకుంటున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బలంగా పనిచేసేలా అనుభవం ఉన్న వారిని గుర్తించి కీలక పార్టీ పదవుల్లో స్థానం కల్పించేందుకు పార్టీ అడుగులు వేస్తోందని సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



జిల్లాకేంద్రంలోని రాంనగర్‌లో రూపుదిద్దుకున్న మండపం

- ఆలయాలు, మండపాల్లో కొలువుదీరనున్న అమ్మవారు
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు

వనపర్తిటౌన్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి, వేంకటేశ్వర స్వామి, రామాలయం, అయ్యప్ప ఆలయం, చౌడేశ్వరి, కమటేశ్వరి, బ్రహ్మంగారి ఆలయాలతో పాటు వివిధ కాలనీల్లో మండపాలను ఏర్పాటు చేసి విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. నిర్వాహకులు అమ్మవార్లను రోజుకో రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రాజప్రసాదంలో వనపర్తి సంస్థానాదీశుల వారసుడు రాజాకృష్ణదేవరావు తొమ్మిది రోజుల పాటు దుర్గామాత పూజలు చేయడంతో పాటు రామాయణ పారాయణంతో ఉత్సవాలను ప్రారంభించి విజయదశమి రోజు శ్రీరామ పట్టాభిషేక పారాయణంతో ముగించడం ఆనవాయితీగా వస్తోంది.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా..

'ఇందిరా మహిళాశక్తి'లో జిల్లావ్యాప్తంగా 10 బస్సుల కొనుగోలు

- అద్దె ప్రాతిపదికన ఆర్టీసీకి అప్పగింత
- ప్రతినెలా అద్దె డబ్బులు మండల సమాఖ్యలో జమ
- పెరగనున్న సభ్యుల ఆదాయం



మహిళా సమాఖ్య కొనుగోలు చేసిన బస్సు

మదనాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి పథకం తీసుకొచ్చి గ్రామీణ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడంతో పాటు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టింది. జిల్లాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా మహిళా సమాఖ్యలకు 10 బస్సులు కేటాయించడంతో పాటు ఆర్టీసీకి అద్దెకు ఇచ్చారు. ఇందులో జిల్లాలోని మదనాపురం, కొత్తకోట, అమరచింత, పెబ్బేరు, రేవల్లి, శ్రీరంగాపురం, పాన్‌గల్, పెద్దమందడి, ఖిల్లాఘనపురం, గోపాల్‌పేట మండల సమాఖ్యలు ఉన్నాయి. ఒక్కో మండల మహిళా సమాఖ్య రూ.36 లక్షలు వెచ్చించి బస్సు కొనుగోలు చేసింది. ఇందులో రూ.30 లక్షలు ప్రభుత్వ గ్రాంట్ ఉండగా.. రూ.6 లక్షలు సమాఖ్య వాటా. ఒక్కో బస్సుకు ప్రతి నెల రూ.69,468 అద్దె ప్రాతిపదికన ఏడేళ్ల కాలానికిగాను ఆర్టీసీకి కేటాయించారు. ఈ డబ్బులు ప్రతినెల సమాఖ్య ఖాతాలో జమ కానున్నాయి. ఇది సుస్థిర ఆదాయ మార్గంగా మారి ఆయా గ్రామాల మహిళా సంఘాలకు మేలు చేకూర్చే విధంగా ఉంటుంది. సంఘాలకు ఆదాయ మార్గంగా మారడంతో పాటు సొంత ఆస్తులు ఉండేలా చేయడం, ఇతర మహిళలకు రుణాలు, వ్యాపార ప్రయోజనాలు అందించాలనే దిశగా ప్రభుత్వం ఆలోచించడం ఈ కార్యక్రమ ఉద్దేశం.

దోహదపడే అంశాలు..

బస్సు అద్దెకు ఇవ్వడంతో వచ్చిన ఆదాయంతో సంఘాల నిధులు పెరుగుతాయి. చాలా మంది మహిళలకు రుణాలిచ్చే అవకాశం, సంఘాల పాలనలో పారదర్శకత, నైతికత, గ్రామీణ మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది.

కలలో కూడా ఊహించ లేదు..



గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మా మాటకు విలువనిచ్చింది. మహిళల ఆర్థిక స్వావలంబనకు బస్సు కొనుగోలుకు అండగా నిలువడం మాకు చేయూతనివ్వడమే.

– జయలక్ష్మి, అధ్యక్షురాలు మండల మహిళా సమాఖ్య, మదనాపురం

భవిష్యత్‌ను మార్చే ప్రాజెక్టు..



ఇలాంటి ప్రాజెక్టులతో మహిళా సమాఖ్యలు ఆర్థికాభివృద్ధితో ముందుకు సాగుతాయి. ఆదాయాన్ని సమకూర్చుకోవడం.. తిరిగి సంఘాల అభివృద్ధికి వినియోగించడం నిరంతరం కొనసాగుతుంది.

– తిరుపతిరెడ్డి, సమాఖ్య ఏపీఎం, మదనాపురం

క్రీడాకారులకు ప్రోత్సాహం

- ఎమ్మెల్యే మేఘారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి
- అట్టహాసంగా ప్రారంభమైన 11వ అంతర్రాష్ట్ర సెపక్‌తక్రా పోటీలు
- రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల నుంచి పాల్గొన్న 20 జట్లు



జ్యోతి వెలిగించి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి

వనపర్తి: ప్రతిభ కనబర్చే క్రీడాకారులకు ప్రభుత్వపరంగా అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తామని, అంతర్జాతీయ స్థాయిలో వారు అత్యుత్తమంగా రాణించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే.శివసేనారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న 11వ అంతర్ జిల్లా సీనియర్ మెన్స్ అండ్ ఉమెన్స్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ క్రీడా పోటీలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ టోర్నీలో రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల వారీగా ఒక్కో జిల్లా నుంచి మెన్స్, ఉమెన్స్ జట్ల చొప్పున మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో క్రీడలకు రూ.800 కోట్లు కేటాయించిందన్నారు. క్రీడాకారులు అంతర్జాతీయస్థాయిలో రాణించేలా పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. సెపక్‌తక్రా క్రీడలకు సంబంధించి బాల్స్ కొనుగోలు చేసేందుకు కొంత ఇబ్బందులు ఉన్నట్లు తెలిసిందని ఇందుకు సంబంధించి అట్టి క్రీడకు సంబంధించిన అసోసియేషన్ వారు తమకు నివేదిక ఇస్తే మలేషియా నుంచి బంతుల్ని తెప్పించేందుకు కృషి చేస్తామన్నారు. క్రీడాకారులు అత్యుత్తమంగా రాణించి మెడల్స్ తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీలో మైదానం ఏర్పాటు చేసే దిశగా కసరత్తు చేస్తోందని చెప్పారు. ఇక జిల్లాకు రూ.57 కోట్లతో స్పోర్ట్స్ స్కూల్ మంజూరు చేయడం జరిగిందని, వచ్చే ఏడాది వనపర్తిలో ఇండోర్ స్టేడియం అందుబాటులోకి తెచ్చే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. యువత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే వరకు శ్రమించాలని.. గత ఏడాది తెలంగాణ నుంచి పారా ఒలంపిక్స్‌లో పతకం సాధించిన దీప్తి జీవాంజిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

విద్యతో పాటు క్రీడలకు జిల్లా నిలయం

ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. వనపర్తి విద్యాపర్తి మాత్రమే కాదని, క్రీడలకు కూడా నిలయమన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఇక్కడి వారే కావడం, రాష్ట్ర క్రీడా మంత్రి కూడా ఉమ్మడి పాలమూరు జిల్లా వాసే కావడం ఎంతో గర్వించదగిన విషయమని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి కూడా క్రీడలపై మక్కువ ఎక్కువని.. ఇక్కడే చదువుకొని అనేక క్రీడల్లో పాల్గొన్నారన్నారు. క్రీడాకారులకు ఏ విధమైన సహాయ సహకారాలు కావాలన్నా హైదరాబాద్‌లోని క్రీడా ప్రాధికార సంస్థకు వెళ్లి కలవాలని సూచించారు. వనపర్తి జిల్లాకు స్పోర్ట్స్ స్కూల్ , పెద్దమందడి, ఖిల్లా ఘనపురం మండలాలకు మినీ స్టేడియం మంజూరు చేసిన ముఖ్యమంత్రి, క్రీడా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలో 9 ఎకరాల్లో క్రికెట్ మైదానం కోసం స్థలాన్ని కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. సెపక్‌తక్రా క్రీడల్లో రాణించి ఇన్‌కంటాక్స్ విభాగంలో ఉద్యోగం సంపాదించిన ఖిల్లాఘనపురం అమ్మాయి నవతను అభినందించారు. ఇదిలా ఉండగా క్రీడలకు వనపర్తి వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షత వహించగా.. పోటీల ప్రారంభానికి ముందు ప్రముఖ క్రీడాకారుడు, హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి క్రీడా జ్యోతి వెలిగించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సెపక్‌తక్రా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి పబ్బ భాస్కర్‌గౌడ్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

న్యూస్‌రీల్

మతోన్మాదమే బీజేపీ అజెండా : సీపీఐ



ఆత్మకూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించి మతోన్మాదమే అజెండాగా ముందుకు సాగుతోందని సీపీఐ రాష్ట్ర నాయకుడు సీఎస్ శెట్టి ఆరోపించారు. జాతీయ మహాసభల సందర్భంగా ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయం ఎదుట పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై దేశ ప్రజలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో సమస్యల సాధనపై నిరంతరం పోరాటాలు చేస్తూ ప్రజల పక్షాన నిలుస్తున్నామని.. ముమ్ముందు మరింత ఉధృతం చేయనున్నామని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణశెట్టి, జిల్లా నాయకుడు శ్రీహరి, సహాయ కార్యదర్శి మోషా, పట్టణ కార్యదర్శి లింగన్న, నాయకులు బాలకృష్ణ, ఖాజాపీర్, కార్మికులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు అమూల్యం



కొత్తకోట రూరల్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీసీ కులాల ఐక్యవేదిక కన్వీనర్ గౌనికాడి రాములు యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ హితానికి బాపూజీ సేవలు అమూల్యమని, ఆయన చూపిన మార్గంలో నడవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి సూర చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ప్రభుత్వ ఉపాధ్యాయులు దేవానందం, అడ్వొకేట్ రాములు యాదవ్, భరత్‌భూషణ్, డేవిడ్, సుతారి విజయ్‌కుమార్, ముంత శివశంకర్ యాదవ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్‌లో మూడు గేట్ల ఎత్తివేత



దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్ద ఆదివారం మూడు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. రెండు రోజులుగా ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగు నుంచి వరద ప్రవాహం వస్తుండటంతో మూడు గేట్లు ఎత్తి 2,100 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడు గేట్లను ఎత్తిన అధికారులు సాయంత్రం రెండు గేట్లను మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. ప్రస్తుతం 32.5 అడుగులుగా ఉంది. ఇదిలా ఉండగా.. ప్రాజెక్టు గేట్లను తెరవడంతో చుట్టు పక్కల గ్రామాలు, జిల్లాకేంద్రం నుంచి సందర్శకులు భారీగా తరలివచ్చారు.

24న ఉమ్మడి జిల్లాస్థాయి బాక్సింగ్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని డీఎస్‌ఏ స్టేడియంలో బుధవారం ఉదయం 9 గంటలకు అండర్–14, 17, 19 విభాగాల బాల, బాలికల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాక్సింగ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ బోనోఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్, అండర్–19 విద్యార్థులు పదో తరగతి మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్, బోనోఫైడ్, మూడు ఎలిజిబిలిటీ ఫారాలతో ఎంపికలకు హాజరుకావాలని కోరారు.

2026లో 'ఎల్లమ్మ' సినిమా

జడ్చర్ల టౌన్: అభిమానుల ఆశీస్సులు, అమ్మవారి కృపతో 2026లో తన తదుపరి చిత్రం ఎల్లమ్మ వస్తుందని బలగం దర్శకుడు వేణు వెల్లడించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని దేవునిగుట్టతండా సమీపంలో ఉన్న శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో ఆయన సతీమణి శ్రీలత, కుమారుడు రేవంత్, కూతురుతో కలిసి చండీహోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన భక్తులతో ఆయన మాట్లాడారు. బలగం సినిమా లాగే సంస్కృతి, సంప్రదాయాలతోపాటు మంచి విలువలతో కూడిన సినిమా అందిస్తానని పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక సంబురం

నేటి నుంచి జోగులాంబదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



విద్యుద్దీపాలతో జోగుళాంబ ఆలయ రాజగోపురం

- విద్యుద్దీపాల వెలుగుల్లో అలంపూర్ క్షేత్రం
- భారీగా తరలిరానున్న భక్తులు
- హాజరుకానున్న ప్రముఖులు

అలంపూర్: దక్షిణకాశీ అలంపూర్ క్షేత్రం శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. సోమవారం నుంచి ఉత్సవాలు ఆరంభం కానుండటంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అమ్మవారు తొమ్మిది రోజుల పాటు వేర్వేరు రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అర్చకుల వేదమంత్రోచ్చారణలతో ఆలయ పరిసరాలు మార్మోగనున్నాయి. వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలిరానుండటంతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ ఈఓ దీప్తి తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆ వెలుగుల్లో జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ సముదాయాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి.

కార్యక్రమాల వివరాలు..

ఉత్సవాలు సోమవారం నుంచి అక్టోబర్ 2 వరకు కొనసాగనున్నాయని ఈఓ వివరించారు. తొలి రోజు ఉదయం 8 నుంచి పూజా కార్యక్రమాలు కొనసాగనుండగా.. మొదట స్వామివారి ఆనతి స్వీకరణ, యాగశాల ప్రవేశం, మహా గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్ వరణం, మహా కలశస్థాపన, అగ్నిముఖం.. సాయంత్రం 6.30కి అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహించనున్నారు.

- 29వ తేదీ మూలా నక్షత్రం శుభ సమయంలో ఉదయం 10 గంటలకు జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి కళ్యాణం.. సాయంత్రం 4.30కి సింహవాహనసేవ నిర్వహించనున్నారు.
- 30వ తేదీ దుర్గాష్టమి రోజు ఉదయం 10 గంటలకు రథోత్సవం
- అక్టోబర్ 1 మహర్నవమి రాత్రి కాళరాత్రి పూజలు జరగనున్నాయి.
- అక్టోబర్ 2 విజయదశమి రోజు అమ్మవారి ఆలయంలో ఉదయం 8 నుంచి మహా పూర్ణాహుతి, అవభృత స్నపనం.. సాయంత్రం 4 గంటలకు శమీ పూజ, 6.30కి నదీ హారతి, రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం, ధ్వజ అవరోహణం ఉంటుంది.

నిరంతర పూజలు..

నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలతో పాటు నిరంతర పూజలు కొనసాగనున్నాయి. నిత్యం సహస్రనామార్చన, నవావరణ అర్చనలు, చండీహోమాలు, ఇతర హోమాలు జరగనున్నాయి. తొమ్మిది రోజుల పాటు యథాతథంగా సాయంత్రం దర్బారుసేవలో అమ్మవారికి నవదుర్గల అలంకరణతో కొలువు పూజలు కుమారి, సువాసిని పూజలు, మహా మంగళహారతి, మంత్ర పుష్పం వంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

తెప్పోత్సవం.. ప్రత్యేకం

నవరాత్రి ఉత్సవాల అనంతరం విజయదశమి రోజు తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై కొలువుదీర్చి తుంగభద్ర నదిలో విహరింపజేస్తారు.

ప్రత్యేక ఏర్పాట్లు..

ఆలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామి, అమ్మవారిని దర్శించుకోవడానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లు, తాగునీటి వసతి కల్పించనున్నారు. వీటితోపాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

చీరల బహూకరణ



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జోగుళాంబ అమ్మవారికి తొమ్మిరోజులపాటు అలంకరించడానికి గద్వాల సంస్థానాధీశులు శ్రీకృష్ణరాంభూపాల్ చీరలను బహూకరించారని ఆలయ ఈఓ దీప్తి తెలిపారు.





విద్యుద్దీపాల అలంకరణలో జోగుళాంబ అమ్మవారి ఆలయం

పర్వతాపురం మైసమ్మ ఆలయంలో



నవాబుపేట: మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలశ స్థాపన, గణపతి పూజ, 23న ప్రత్యేక అలంకరణ ప్రారంభం, 24న విశేష పూజ, 25న ప్రత్యేక అలంకరణ, 26న ప్రత్యేక అభిషేకాలు, 27న పుష్పార్చన, 28న కవచ ధారణ, ప్రత్యేక అలంకరణ, 29న సరస్వతి పూజ, చండీ హోమం, పూర్ణహుతి, 30న ఆయుధ పూజ, అక్టోబర్ 1న దేవి పూజా, 2న శమీ పూజా, దసరా ఉత్సవం, మంగళహారతితో కార్యక్రమాలు ముగుస్తాయని వివరించారు.

శ్రీరామకొండ.. కిటకిట



శ్రీరామకొండపై క్యూ కట్టిన భక్తులు

నారాయణపేట: కోయిలకొండ మండలకేంద్రం సమీపంలోని శ్రీరామకొండ భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం అమావాస్య సందర్భంగా శ్రీరామ పాదాన్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది భక్తులు శ్రీరామపాదాన్ని దర్శించుకొని రామనామ తారకమంత్రాన్ని పఠించారు. ముందుగా ఆలయంలో పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, నైవేద్యం సమర్పణ, మహా మంగళ హారతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



కొండపైకి కాలినడకన వస్తున్న భక్తులు



స్వామి వారి దర్శనానికి వేచివున్న భక్తులు

కురుమూర్తికి పోటెత్తిన భక్తులు



రాజగోపురం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చిన్నచింతకుంట: అమ్మాపురం కురుమూర్తిస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం అమావాస్య సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి.. సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. కొందరు భక్తులు మెట్టు మెట్టుకు కొబ్బరికాయ కొడుతూ స్వామి చెంతకు చేరుకొని దర్శించుకున్నారు. మరికొందరు కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారుచేసి స్వామికి సమర్పించారు. తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో రద్దీగా కనిపించింది. జాతర మైదానంలోని దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. పలువురుభక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు బాదం వెంకటేశ్వర్లు, భారతమ్మ, నాగరాజు, భాస్కరాచారి ఏర్పాట్లను పరిశీలించారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

జడ్చర్ల: ఇంట వద్ద ఖాళీగా ఉండకుండా పొలానికి వెళ్లి వ్యవసాయ పనులు చేయమని భార్య చెప్పిన మాటలకు కోపంతో క్షణికావేశానికి గురై పురుగుల మందు తాగిన భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని కొండేడుకు చెందిన పడకంటి యాదగిరి(47) శనివారం ఇంట్లో ఉన్న పరుగుల మందు తాగగా.. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ప్రతిరోజు మద్యం తాగి ఎలాంటి పనులు చేయకపోవడంతో పొలం దగ్గరకు వెళ్లి పనులు చేయాలని చెప్పడంతో తన భర్త పురుగుల మందు తాగి మృతిచెందాడని భార్య భీమమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కలప లారీ పట్టివేత: కేసు నమోదు



పెద్దకొత్తపల్లి: అనుమతి లేకుండా అక్రమంగా కలప దుంగలను తరలిస్తున్న లారీని కొల్లాపూర్ ఫారెస్టు అధికారులు శనివారం రాత్రి దాడి చేసి కల్వకోలులో ఎస్ఆర్ఓ ఈశ్వర్, ఫారెస్టు సెక్షన్ అఫీసర్ శివకుమార్, బయన్న, లక్ష్మయ్య పట్టుకున్నారు. కల్వకోలులో వేప వృక్షాలను నెలకొరగా వేప దుంగలను కట్ చేసి లారీలో అక్రమంగా హైదరాబాదుకు తరలిస్తుండగా పట్టుకున్నారు. లారీని కొల్లాపూర్ టింబర్ డిపోకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. కలప స్మగ్లర్లు ఇబ్రహీంపట్నానికి చెందిన వ్యక్తులని ఫారెస్టు అధికారులు తెలిపారు.

0.97 గ్రాముల అల్ప్రాజోలం పట్టివేత

- కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు విమర్శలు



బిజినేపల్లి: మండలంలోని అల్లీపూర్ శివారులో బైక్‌పై అల్ప్రాజోలాన్ని తరలిస్తున్న ఇద్దరిని నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అబ్కారీ శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారి రాజేశ్వరి తెలిపిన వివరాలు.. అబ్కారీ శాఖ ఉప కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ టాస్క్‌ఫోర్స్ అధికారి రాజేశ్వరి శనివారం మధ్యాహ్నం అల్లీపూర్ శివారులో అల్ప్రాజోలం తరలిస్తున్నారన్నా సమాచారంతో దాడి చేసినట్లు తెలిపారు. నిందితులు సాంబమహేష్, వెంకటయ్యగౌడ్ అదుపులోకి తీసుకొని 0.97 గ్రాముల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండల పరిధిలో విచ్చల విడిగా అల్ప్రాజోలం సరఫరా అవుతుంటే అధికారుల దాడిలో పట్టుకున్న అల్ప్రాజోలం పరిమాణం విమర్శలకు తావిస్తోంది. మాముళ్ల మత్తులో స్థానిక అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

37 గ్రాముల గంజాయి స్వాధీనం

కల్వకుర్తి రూరల్: గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి 37 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. మండలంలోని మార్చాల గ్రామంలోని మైసమ్మ దేవాలయం వద్ద ఒడిషాకు చెందిన అశ్విన్‌కుమార్‌సాహు అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. అనంతరం జడ్జి ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్ శివారు కృష్ణానది సమీపంలోని పుష్కరఘాట్ వద్ద ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం నీటిలో తేలింది. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ రామన్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి వయస్సు దాదాపు 70 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బీచుపల్లి క్షేత్రంలో సినీ మ్యూజిక్ డైరెక్టర్



మ్యూజిక్ డైరెక్టర్ శివమణి

ఎర్రవల్లి: మహాలయ అమావాస్యను పురస్కరించుకొని బీచుపల్లి పుణ్య క్షేత్రాన్ని ఆదివారం సినీ మ్యూజిక్ డైరెక్టర్ శివమణి సందర్శించి.. తమ మాతృ, పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. ఈ సందర్భంగా కృష్ణానది పుష్కరఘాట్ వద్ద పూజారి అనిల్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

జూరాలకు 2.20 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



జూరాల 29 గేట్ల ద్వారా దిగువకు పరుగులు పెడుతున్న వరద

- ప్రాజెక్టు 29 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 2.29 లక్షల క్యూసెక్కులు దిగువకు

ధరూరు/ఆత్మకూర్: కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీ వరద కొనసాగుతోంది. శనివారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 2.39 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆదివారం రాత్రి 8 గంటలకు 2.20 లక్షల క్యూసెక్కులకు తగ్గిన ట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 29 క్రస్టు గేట్లను ఎత్తి గేట్ల ద్వారా 2.01లక్షల క్యూసె క్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 28,734 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 69 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 580 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 2.29 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.493 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 33.17 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 12 గేట్లను ఎత్తి దిగువన ఉన్న జూరాలకు 45,440 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

జూరాల ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి కొనసాగింది. ఇప్పటి వరకు ఎగువలో 6 యూనిట్ల ద్వారా 352.205 ఎంయూ, దిగువలో కేంద్రంలో 370.862 మిలియన్ యూనిట్లు కలిపి 723.067 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. జూరాలకు అత్యధికంగా వరదనీరు చేరుతుండడంతో దిగువ ఉత్పత్తి కేంద్రంలో ఆదివారం విద్యుదుత్పత్తి చేపట్టలేదు.

దైవ దర్శనానికి వెళ్తూ మృత్యు ఒడిలోకి..

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్
- భర్త మృతి.. భార్యకు తీవ్రగాయాలు

చిన్నచింతకుంట: దైవ దర్శనానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన భార్యాభర్తలు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో భర్త మృతిచెందగా.. భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ ఓబుల్‌రెడ్డి వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వీరన్నపేటకు చెందిన బుట్ట శ్రీనివాసులు (44), అతడి భార్య నిర్మల ఆదివారం కురుమూర్తి స్వామిని దర్శించుకునేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కౌకుంట్ల మండలం తిర్మలాపురం గ్రామశివారులో చిన్నచింతకుంట మండలం గూడూరుకు చెందిన మహమ్మద్ రహీం ట్రాక్టర్ అతి వేగంగా వస్తూ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీనివాసులుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి భార్య నిర్మలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆత్మకూర్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూర్ మార్చురీకి తరలించారు. మృతుడి తమ్ముడు గౌరీ శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరమేశ్, తులసీయాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ ఆస్పత్రికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



శ్రీనివాసులు మృతదేహం



గాయపడిన నిర్మల

ప్రమాదవశాత్తు కిందపడి మహిళ మృతి

నవాబుపేట: ప్రమాద వశాత్తు మహిళ కిందపడి మృతిచెందిన ఘటన మండలంలోని తీగలపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గూళ్ల పార్వతమ్మ(53) ఆదివారం తెల్లవారు జామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆరుబయటికి వచ్చి ప్రమాద వశాత్తు బాత్‌రూం గది ముందు కిందపడి మృతిచెందింది. మృతురాలి కుమారుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..



బిక్క్య(ఫైల్)

తిమ్మాజిపేట: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో జరిగినట్లు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని సూర్యానాయక్ తండాకు చెందిన ముడావత్ బిక్క్య(33) ఈ నెల 19న చొటా చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఎంతకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతకగా ఆ చూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 20న చెరువుకట్టపై మృతుడి చెప్పులు, బట్టలు కనిపించడంతో తండా వాసులు చెరువులో గాలించగా ఆదివారం బిక్క్య మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి మన్య ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హమాలీ దుర్మరణం



సువన్న (ఫైల్)

మక్తల్: ద్విచక్రవాహనం, కర్ణాటక బస్సు ఢీకొని హమాలీ మృతిచెందిన ఘటన మక్తల పట్టణంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా.. మక్తల్ మండలం గడ్డంపల్లికి చెందిన సువన్న(45) మక్తల్‌లో హమాలీ పనిచేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. ఆదివారం పనులు ముగించుకొని బైక్‌పై సొంతూరుకు వెళ్తున్న సమయంలో మహబూబ్‌నగర్ నుంచి రాయచూర్ వెళ్తున్న కర్ణాటక బస్సు మక్తల్ పట్టణంలోని నల్లజానమ్మ ఆలయం సమీపంలోని కల్వర్టు వద్ద బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మక్తల్ మార్చురీ గదిలో ఉంచారు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

నవాబుపేట: తన కుమారుడు ఓ అమ్మాయిని ప్రేమించాడని, అమ్మాయి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి జైలుకు పంపించారని.. బయటికి వచ్చినా అదే మనసులో ఉంచుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఉత్తరప్రదేశ్‌కి చెందిన మోహన్ తండ్రి రామ్‌జిత్ తెలిపారు. పూర్తి వివరాలిలా.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బాగేలీ జిల్లా పరిధిలోని సిద్దార్థనగర్‌కు చెందిన మోహన్(23) మండలంలోని కాకర్‌జాల్, చౌడూర్ గ్రామాల సమీపంలో ఉన్న ప్రైవేట్ కంపెనీలో పని చేసేవాడు. రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా ఆదివారం మృతుడి తండ్రి రామ్‌జిత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కుమారుడు మోహన్ సొంత రాష్ట్రంలో ఓ అమ్మాయిని వన్‌సైడ్ లవ్ చేశాడని, ఈక్రమంలో అమ్మాయి బంధువులు తన కుమారుడిపై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి జైలుకు పంపించారన్నారు. కాగా జైలు నుంచి వచ్చిన అనంతరం సైతం అదే ధ్యాసలో బాధపడుతుండేవాడన్నారు. దూరంగా ఉంచితే మార్పు వస్తుందన్న ఆలోచనతో తెలంగాణలో తమ బంధుల ద్వారా ఇక్కడికి రెండు నెలల క్రితం పనికి పంపించినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న తరుణంలో సైతం అదే బాధలో ఉండి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

- మరో మహిళకు తీవ్రగాయాలు



మమత (ఫైల్)

మక్తల్: పిడుగుపాటుకు మహిళ మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని గొల్లపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన మమత (30), సుజాత, స్వప్న ముగ్గురు కలిసి వరి పొలంలో కలుపు తీసేందుకు ఉదయం 10 గంటల సమయంలో వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవగా.. పక్కనే ఉన్న వేపచెట్టు వద్దకు వెళ్లి నిల్చున్నారు. ఈక్రమంలో చెట్టుపై పిడుగు పడడంతో మమత అక్కడికక్కడే మృతిచెందగా.. సుజాతకు తీవ్రగాయాలయ్యాయి. అదృష్టవశాత్తు స్వప్న ప్రమాదం నుంచి బయటపడింది. అక్కడే ఉన్న మరో రెండు మేకలు మృతిచెందాయి. ప్రమాద విషయం తెలియడంతో మమత భర్త లక్ష్మయ్య, సుజాత భర్త అంజప్ప అక్కడికి చేరుకొని వారిని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మమత మృతిచెందిందని వైద్యులు తెలిపారు. సుజాత పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో 108 వాహనంలో మహబూబ్‌నగర్‌కు తరలించారు. మమత, సుజాత ఇద్దరూ తోడి కోడళ్లు. పిడుగుపాటులో ఒకే కుటుంబానికి చెందిన మహిళ మృతిచెందడం, మరొకరు తీవ్రంగా గాయపడడంతో ఆ కుటుంబంతో పాటు గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

మట్టి టిప్పర్ల అడ్డగింత

నర్వ: మండలంలోని లంకాల్ శివారులో మట్టిని అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామ శివారులోని డీ- 14 కెనాల్ వద్ద ఉన్న మట్టిని అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తుండడంపై మండిపడ్డారు. నర్వ వద్ద ఏర్పాటు చేస్తున్న ఓ పరిశ్రమ నిర్మాణ పనులకు మట్టిని అక్రమంగా తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం నర్వ పోలీస్ స్టేషన్‌లో మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు అందించారు.